క్లుప్తంగా

'ఏఈఈ'లో గిరిజన యువకుడి ప్రతిభ



ఖానాపురం : మండలంలోని బాల్‌తండాకు చెందిన తేజావత్ విద్యాసాగర్ ఇటీవల వెలువడిన ఏఈఈ ఫలితాల్లో ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయిలో 256వ ర్యాంక్ సాధించి పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. విద్యాసాగర్‌ను స్థానిక నాయకులు, తండావాసులు అభినందించారు.

న్యాయవాదుల నిరసన



నర్సంపేట రూరల్ : జనగామలో న్యాయవాదులపై పోలీసుల దాడిని నిరసిస్తూ నర్సంపేటలోని మున్సిఫ్ కోర్టులో న్యాయవాదులు గురువారం ఎర్ర రిబ్బన్ ధరించి విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి మాట్లాడారు. న్యాయవాదులపై పోలీసుల దాడి దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, తండా సారంగపాణి, తొగరు నర్సింహారెడ్డి, గూళ్ల ప్రభాకర్, మోటూరి రవి, కొంగరి రాజు, బొట్ల పవన్, కంసాని అశోక్, బొడ్డుపెల్లి అజయ్, పానుగోటి అజయ్, దాస్యం రంగనాథస్వామి, మాంకాలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాటు వేసి నిరసన



నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలోని బురద రోడ్డుపై బీసీ కాలనీవాసులు గురువారం నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలోని రోడ్డు బురదమయంగా మారిందని తెలిపారు. రోడ్డుపై నడవలేని దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇకనైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సన్మానం



చెన్నారావుపేట : స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహించి బదిలీ అయిన స్టాఫ్ నర్స్ స్వరూపరాణి, ఏఎస్ఎం ఫ్రాన్సిస్కాలను మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్ కోఆర్డినేటర్ నర్మెట యాదగిరి ఆధ్వర్యంలో శాలువాలు కప్పి గురువారం సన్మానించారు. అనంతరం యాదగిరి మాట్లాడారు. స్వరూపరాణి, ఫ్రాన్సిస్కా కరోనా సమయంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో మండల సమైక్య సీసీలు కట్టయ్య, మంజుల, ఉమ, ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకులపెల్లి ఉప్పలయ్య, ఫెండ్స్ యూత్ అధ్యక్షుడు మాదాసి ప్రవీణ్, మాజీ అధ్యక్షులు జంగిలి కిరణ్, బారపాక నవీన్, సీఆర్‌పీలు కందిక శిల్ప, హేమలత, నర్మెట ప్రజ్వల్, బొక్కల బుజ్జమ్మ, రమ, చింత కవిత పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి



పర్వతగిరి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో చేపట్టనున్న హెడ్‌కుక్, స్వీపర్, శానిటరీ వర్కర్, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల కమిటీ సభ్యులు గారె జయరాజ్, జెరిపోతుల వంశీకృష్ణ కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్ వెంకటస్వామికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజ్, వంశీకృష్ణ మాట్లాడారు. గతంలో కేజీబీవీల్లో చేపట్టిన నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయని చెపారు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా అర్హులను ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల ఇన్‌చార్జ్ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతపై కేసు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని జాన్‌పాక, కీర్తినగర్, గొర్రెకుంట ప్రాంతంలో పోలీసులు గురువారం పెట్రోలింగ్ నిర్వహించి జాన్‌పాక ప్రాంతంలో తన ఇంటి ఎదుట గుడుంబా విక్రయిస్తున్న గంధ్రకోట విజయను అదుపులోకి తీసుకుని 10 లీటర్ల గుడుంబా, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విజయపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబూలాల్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



నర్సంపేట : మాట్లాడుతున్న జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శివప్రసాద్‌రెడ్డి

నర్సంపేట : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటాని పౌర సరఫరాల శాఖ అధికారి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా మేనేజర్ సంధ్యారాణి ఆకాంక్షించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గోపీకృష్ణ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో గురువారం చేపట్టిన కార్యక్రమంలో వారు మొక్కలు నాటి మాట్లాడారు. వ్యాపార, వాణిజ్య ప్రదేశాల్లోని ఖాళీ స్థలాల్లోనూ మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఫైజుద్దీన్, డీటీ సంధ్య, గోనెల రవీందర్‌రావు, యుగంధర్, నరేందర్, జగ్గారావు, రమేష్, శివన్న పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : పట్టణంలోని కుమ్మరికుంట కాలనీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్ మొక్క నాటి మాట్లాడారు.అనంతరం చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. కార్యక్రమంలో భాంజీపేట వైద్యాధికారి అరుణ్‌చంద్ర, రాజేంద్రప్రసాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కార్మికులు ఆయిల్‌బాల్స్ చల్లి రసాయన మందు పిచికారీ చేశారు. ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరపీడితులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జోనా మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని చెప్పారు. పుస్కోస్ హైస్కూల్‌లో ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రాజు విద్యార్థులతో కలిసి సుమారు 200 మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు కొండేటి అనిత, మంచాల రామకృష్ణ, అధికారులు అయిలయ్య, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని కొండాయిల్‌పల్లిలో నిర్వహించిన ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి రజిత మాట్లాడారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, అంగన్‌వాడీ టీచర్ పిన్నింటి రజిత, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని అప్పల్‌రావుపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఉషాదయాళ్ మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరూ శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, జీపీ కార్యదర్శి నరేష్, హెడ్‌మాస్టర్ రవీందర్, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏనుగల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, గ్రామ ప్రత్యేక అధికారి ప్రశాంత్, విద్యాశాఖ నోడల్ అధికారి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో సీఐ రాజగోపాల్ మొక్కలు నాటి మాట్లాడారు. మండలంలోని కోమటిపల్లితండా, ఖానాపురం పరిధిలోని టేకులతండా, తదితర ప్రాంతాల్లో వైద్యం శిబిరం నిర్వహించగా డాక్టర్ జ్యోతి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల సధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా స్పెషల్ ఆఫీసర్ బాలాజీ సందర్శించి మాట్లాడారు. కేజీబీవీలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఫణి కుమార్, ఎస్ఐ గూడ అరుణ్‌కుమార్, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఎంపీఓ అంబటి శ్రీధర్, రాజు, కేజీబీవీ ఎస్ఓ మెట్టుపల్లి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని మొండ్రాయిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కాసర్ల రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, ఏపీఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న ఎస్సై అరుణ్

చెన్నారావుపేట : మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కోరారు. మండలంలోని అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్ వద్ద చెన్నారావుపేట-నెక్కొండ ప్రధాన రహదారిలో గురువారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు కలిగి ఉండడంతోపాటు హెల్మెట్ ధరించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య, పోలీసు సిబ్బంది సురేశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



రాయపర్తి : మండలంలోని తెట్టెకుంటతండా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, తండావాసులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అసెంబ్లీలో బిల్లు ఆమోదించి నూతన గ్రామపంచాయతీలు ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వశపాక కుమారస్వామి, మారయ్య, గజవెల్లి ప్రసాద్, యుగేందర్‌రెడ్డి, దోకుడు దేవేందర్, యాదగిరి, గజవెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాకయ్య

నర్సంపేట : రాష్ట్రంలోని పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు ఈదునూరి యాకయ్య, రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి బాబన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మైసి శోభన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్య కార్మికులకు హామీలు ఇస్తూనే వాటిని అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. అరకొర జీతాలతో పారిశుద్ధ్య కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసైన్డ్ భూమికి సంబంధించి పూర్తిస్థాయి డాక్యుమెంట్‌తో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి సారయ్య, గడ్డం సమ్మయ్య, చిలపాక యశోద, బొచ్చు భాస్కర్, ఉమ, అలవాల రాజు, లక్ష్మి, అనిత, ఉపేంద్ర, కనకతార, సరిత, ఎలీషా, దేవేందర్, భరత్, యుగందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటకు చెందిన కలువల సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన 'మేమున్నాం' సేవా సంస్థ వ్యవస్థాపకుడు, ఎన్ఆర్ఐ అర్జుల ఇతిహాస్‌రెడ్డి అతడి తల్లిదండ్రులు (మాజీ సర్పంచ్) అర్జుల మంగ-తిరుపతిరెడ్డి గురువారం రూ.35 వేల సాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అబ్బిడి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమార్కులపై చర్యలు తీసుకోండి'



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో పంట రుణాలు, రెన్యువల్‌లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డు నమోదులో తప్పులు, పంట రుణాలు లేకున్నా ఉన్నట్లు నమోదు, రుణగ్రహీతలకు ఎక్కువ మొత్తంలో రుణ నమోదు, ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు అందించారని తెలిపారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని, అర్హులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, ఉపాధ్యక్షుడు మాలోత్ మోహన్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్ సింగ్, నాయకులు భూక్య భావ్‌సింగ్, జిల్లా మునేందర్, కడుదూరి కట్టయ్య, దుంపల ఇంద్రారెడ్డి, ఆంగోత్ పూల్ సింగ్, రాయసాబ్, బత్తిని మల్లయ్య, ఎరుకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐకేఎంఎస్ అఖిల భారత సదస్సు

వర్ధన్నపేట : నేటి (శుక్రవారం) నుంచి రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) అఖిల భారత సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి మేధావులు హాజరవుతారని తెలిపారు. దేశంలో ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండ, నిరాశ్రయీకరణ, హక్కుల సంహరణ, తదితరాల గురించి వివరిస్తారని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ, ఖనిజ సందను దోచుకునేందుకు కార్పొరేట్ సంస్థలు పాల్పడుతున్న దురాగతాలు, రాజ్యాంగంలోని ఐదో, ఆరో షెడ్యూళ్ల ద్వారా లభించిన ఆదివాసీ హక్కులపై ప్రసంగాలు ఉంటాయని వివరించారు. మండలం నుంచి శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై అఖిల భారత సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా తీజ్ వేడుకలు



సంగెం : తీజ్ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, విజయ్‌చందర్, తదితరులు

సంగెం: మండలంలోని పోచమ్మతండా, బోరింగ్ తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గిరిజన యువతులు, మహిళలు నృత్యాలు చేసి ఆడిపాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాదరావు, స్థానికులు ముల్క ప్రసాద్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండసముద్రంతండాలో..



నర్సంపేట రూరల్ : వేడుకలో రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని కొండసముద్రంతండాలో తీజ్ వేడుకలను తండావాసులు గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించి గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ కమిటీ అధ్యక్షుడు అచ్చ దయాకర్, నాయకులు ఆముదాల రమేష్, బానోత్ రాజేందర్, సప్తగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న రోడ్డు స్థలం..!

చెన్నారావుపేట : మండలంలోని చెరువుకొమ్ముతండా శివారులోని ప్రధాన రహదారిని అమృతండాకు చెందిన భూక్య వశ్రాం ఆక్రమించుకున్నాడని తెలుస్తోంది. అతడి పొలం పక్కనే ఉన్న రోడ్డు స్థలాన్ని ఆక్రమించినట్టు తండావాసుల్లో చర్చ సాగుతోంది

పరామర్శ

రాయపర్తి : మండలంలోని జింకురాంతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుగులోతు శ్రీనివాస్‌ను అతడి తల్లి కౌసల్య, మండల కేంద్రంలో మచ్చ లలిత ఇటీవల వేర్వేరు ఘటనల్లో మృతి చెందిన క్రమంలో బాధిత కుటుంబాలను ఆ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. అలాగే జేతురాం తండాలో గుగులోతు సాజి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



నెక్కొండ : సమ్మెలో మాట్లాడుతున్న వెంకటయ్య



ఖానాపురం : నిరసన తెలుపుతున్న కార్మికులు

నెక్కొండ : గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు, ఉద్యోగులు గురువారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానంతో కార్మికులకు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆందోళన వెలిబుచ్చారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు భూక్య నరేశ్, ప్రధాన కార్యదిర్శ చెలకలపల్లి వీరస్వామి, నాయకులు ఈదునూరి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు ఉస్మాన్ పాషా మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ బాధ్యులు వీరన్న, బిక్షపతి, విజయ్, వెంకటమ్మ, సోమక్క, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు కుమ్మరి రాజు అధ్యక్షతన చేపట్టిన సమ్మెను ఉద్దేశించి సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి కోరె కుమారస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొల్ల పరశురాములు, మండల ఉపాధ్యక్షుడు వేలేల రవి, దవడ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపాక రాజేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు రాజు, సాంబయ్య, భగవాన్‌రెడ్డి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు చిన్నారులకు శ్రేయస్కరం



చెన్నారావుపేట : మాట్లాడుతున్న రాధ



వర్ధన్నపేట : అక్షరాభ్యాసం చేయిస్తున్న అనిత

చెన్నారావుపేట : తల్లిపాలు చిన్నారులకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా ఆమె అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. తద్వారా శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీహెచ్ఓ భద్రయ్య, హెల్త్ అసిస్టెంట్ సురేందర్, అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, సరోజన, మంజుల, శౌరీలు, విజయ, ఆయా దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని మూడో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే బాలలకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొండేటి అనిత మాట్లాడారు. బాల్యంలోనే విద్యాబుద్ధులు నేర్పడంతోపాటు క్రమశిక్షణ అలవర్చేలా కృషి చేయాలని సూచించారు.

డ్రగ్స్ వినియోగం, విక్రయం నేరం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రాజు

వర్ధన్నపేట : ప్రభుత్వ నిషేధిత డ్రగ్స్ వినియోగం, విక్రయం చట్టరీత్యా నేరమని ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని ఇల్లందలోని ప్రభుత్వ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల తలెత్తే నష్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి బారిన పడితే జీవితాలు పాడైపోతాయని చెప్పారు. ప్రాణాపాయం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు అడియాసలవుతాయని ఆందోళన వెలిబుచ్చారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయించేందుకు ఎవరైనా యత్నిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సదస్సులో పోలీస్ కానిస్టేబుల్ యాకూబ్‌పాషా, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజ సేవే 'ఎస్‌ఆర్‌ఆర్' ధ్యేయం

- ఇన్‌ఫ్రా సంస్థల అధినేత శ్రీనివాస్‌రెడ్డి



బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : సమాజ సేవే ధ్యేయంగా ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జయరాంతండాలో తాగునీటి సమస్య పరిష్కరించేలా తన సొంత డబ్బుతో ఏర్పాటు చేసిన బోరుమోటార్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం కేశవాపురంలో దుర్గామాత ఆలయ అభివృద్ధిపై చర్చించి కమిటీకి రూ.30 వేల సాయం అందజేశారు. తదనంతరం తండాకు చెందిన మూనావత్ వెంకన్న, రాయపర్తికి చెందిన దివ్యాంగురాలు మచ్చ లలిత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు బియ్యం, నూనె నిత్యావసర సరుకులు పంపించి ఫోన్ ద్వారా పరామర్శించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల ప్రజలకు సేవలు అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని చెప్పారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, మాచర్ల ప్రభాకర్, అఫ్రోజ్, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఎదుట ధర్నా

నర్సంపేట రూరల్ : అవుట్ సోర్సింగ్ నియమకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ నాయకులు బొట్ల నరేష్, శ్రీకాంత్, సిద్దు మాట్లాడారు. కళాశాలలో చేపడుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న 180 పోస్టులకు అవుట్ సోర్సింగ్ ద్వారా ఎంపిక చేయనుండగా ఎంపిక ఏజెన్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అవకతవకలకు తావులేకుండా మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.